నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్, ఆగస్టు 29: మేడ్చల్ మండలం మెడిసిటీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించ నున్నట్టు పట్టణ ఏఈ శశిధర్ రెడ్డి ఒక ప్రక టనలో తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగిం చనున్న కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం విధిస్తున్నామని తెలిపారు. సామ్‌సంగ్ గోదాం, దివ్య అగ్రో, ఫాక్స్ లైఫ్ సైన్సెస్, ఖందేల్‌వాల్, హిందుస్థాన్ మ్యాగ్ని షియమ్, మరినో 1, 3 ప్రాంతాల పరిధిలో అంతరాయం అమలవుతుందని తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

అభిరాందాస్ (ఫైల్) భానుప్రకాశ్‌రెడ్డి. (ఫైల్)

ఘట్‌కేసర్,ఆగస్టు29: యువకుడు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడ గ్రామానికి చెందిన కంభం భానుప్రకాశ్‌రెడ్డి(24)బీటెక్ పూర్తిచేశాడు. రెండు నెలల క్రితం నగరంలో ఉంటున్న తన స్నేహితుడి గదిలో ఉంటూ ఉద్యోగం చూసుకుంటానని బైక్,ల్యాప్‌టాప్ తీసుకెళ్లాడు. ఈనెల 25న అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. గమనించిన తల్లిదండ్రులు బైక్,ల్యాప్‌టాప్ ఏమైందని, ఎందుకు ఇంతరాత్రి వచ్చావని ప్రశ్నించగా డబ్బులు కావల్సి ఉండగా,కుదువ పెట్టానని,డబ్బులు ఇస్తే తీసుకొస్తానని తెలిపారు. ఇందుకు తల్లిదండ్రులు తీవ్రంగా మందిలించారు. దీంతో అతను ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి భాస్కర్‌రెడ్డి అతని కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడ్‌మెట్‌లో ప్లంబర్..

నేరేడ్‌మెట్: ప్లంబర్ అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ కథణం ప్రకారం.. వినాయకనగర్‌లో అభిరాందాస్ (44) ఇంటిని అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అభిరాందాస్ ప్లంబర్‌గా పనిచేసుకుంటూ జీవనంసాగిస్తున్నాడు.ఈనెల 28ఉద యం ఇంటినుంచి దుకాణానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఈ రోజు వరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

దోభీఘాట్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

మల్కాజిగిరి, ఆగస్టు 29: దోభీఘాట్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి సర్కిల్ జ్యోతినగర్‌లోని దోభీఘాట్‌లో వసతులు కల్పించాలని రజక సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ కులవృత్తులు చేస్తున్న వారికి ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్ పరిధిలోని అన్ని దోభీఘాట్‌లలో నీటి సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.కార్యక్రమంలోపాండు,యాదయ్య,లక్ష్మయ్య పాల్గొన్నారు.

అరుంధతినగర్ అంటే చిన్నచూపా?

మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న యువకుడు విక్రమ్

- పేదోళ్లు నివసించే డివిజన్ మేయర్‌కు కనిపిస్తలేదా?
- సమస్యలు పరిష్కరించాలిలని యువకుడి అర్ధనగ్న ప్రదర్శన

జవహర్‌నగర్, ఆగస్టు 29: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అరుంధతినగర్ లేదా? గత ప్రభుత్వం చేసిన ప్రగతే కనిపిస్తుంది తప్పితే... కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదనీ, మేయర్, కమిషనర్‌కు అరుంధతినగర్‌వాసుల అవస్థలు కనిపిస్తా లేవా అంటూ అరుంధతినగర్‌కు చెందిన ఓ యువకుడు మున్సిపల్ కార్యాలయం ముందు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపాడు. అరుంధతినగర్‌లో ప్రజలు కుక్కల బెడదా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతుంటే మేయర్, కమిషనర్ అరుంధతినగర్‌కు సందర్శించిన పాపానపోలేదని నిరసిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు యువకుడు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాడు. ఈ సందర్భంగా యువకుడు విక్రమ్ మాట్లాడుతూ కుక్కల స్వైర విహారంతో భయం గుప్పిట్లో ప్రజలు బిక్కుబిక్కు బ్రతుకుతూ కాలం వెళ్లదీస్తున్నా, ఇంత వరకు కుక్కలను పట్టుకెళ్ళని మున్సిపల్ అధికారులు అంటూ మండిపడ్డారు. భూగర్భ డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు నీరు ఇళ్ళలోకి చేరుతుందని, వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురైతున్నారు. అరుంధతినగర్‌కు మేయర్, కమిషనర్ ఒక్కరోజైనా వచ్చి సమస్యలను పరిశీలించిన దాకలాలు లేవని అన్నారు. మౌలిక వసతులు కల్పించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరుంధతినగర్‌వాసులు పాల్గొన్నారు.

చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఉప్పల్, ఆగస్టు 29 : ఉప్పల్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ రామస్వామి ఫంక్షన్‌హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉప్పల్ గణేశ్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని, భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు జెట్ట కిశోర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కందికంటి అశోక్, చింతల నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నేరాల అదుపులో యువత భాగస్వామ్యం కావాలి

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్, ఆగస్టు 29 : నేరాల అదుపులో యువతను భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు డీసీపీ కోటి రెడ్డి తెలిపారు. గురువారం మేడ్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలను అదుపు చేయడంలో పోలీసులకు యువత సహకరించాలన్నారు.గంజాయి, డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, డీఐ వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ ఆనంద్‌కుమార్, హెచ్ఎం పద్మనాభం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

కీసర,ఆగస్టు 29: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. మండల పరిధి రాంపల్లిదాయరలోని బాలవికాస్‌లో తెలంగాణ ఇందిరా ఫెలోషిప్ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలకు తమ ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత లభిస్తుందని, ప్రతి మహిళా ఆచరణాత్మక నైపుణ్యాలతో ముందుకెళ్లాలని సూచించారు. ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ముందుకెళ్లాలంటే మహిళలే కీలకభూమిక పోషించాలని అన్నారు. కార్యక్రమలో నాయకురాలు సల్లా సౌజన్య,పీసీసీ ప్రధాన కార్యదర్శి గోదాసు పృధ్వీ, యువజన కాంగ్రెస్ నాయకులు లీగల్ సెల్ చైర్మన్ వంగాల వెంకన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలి

మల్కాజిగిరి, ఆగస్టు 29: పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని పల్లవి ప్రోగ్రెసివ్ ఇంటర్‌నేషనల్ స్కూల్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. గురువారం అల్వాల్‌లోని పల్లవీ స్కూల్‌లో స్పోర్ట్స్ డే నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలత, కో ఆర్డినేటర్ దివ్యరమణి, ఇన్‌చార్జి మోనికరెడ్డి, స్వప్న, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డేలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి సీఎంకు వినతి

ఉప్పల్, ఆగస్టు 29 : తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, బాలమ్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టూరిజం ఉద్యోగులు

స్టాఫ్ నర్సుతోనే దవాఖాన నిర్వహణ సరికాదు

బస్తీ దవాఖానలో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

ఉప్పల్, ఆగస్టు 29: నాచారం రైతుబజార్‌లోని బస్తీ దవాఖానను గురువారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ తనిఖీ చేశారు. బస్తీదవాఖానలో వైద్యులు అందుబాటులో ఉండాలని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాఫ్ నర్సుతోనే దవాఖానను నిర్వహణ చేయడం సరికాదన్నారు. బస్తీ దవాఖానలో సమస్యలు పరిష్కరించాలన్నారు. డీఎంహెచ్ఓ స్పందించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. బస్తీ ప్రజల కోసం ఏర్పాటు చేసిన దవాఖానలో సౌకర్యాలు లేకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ నాయకులుసాయిజెన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి డివిజన్ కన్వీనర్‌గా సతీష్‌రెడ్డి

కాప్రా, ఆగస్టు 29: కాప్రా గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా కాప్రా బీఆర్ఎస్ నాయకుడు రేగళ్ల సతీష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పల్ నియోజకవర్గం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కో కన్వీనర్ చల్లా ప్రభాకర్ గురువారం కాప్రా డివిజన్ శ్రీరాంనగర్‌లో ఉత్సవ సమితి సమావేశం నిర్వహించి సభ్యులందరి సమక్షంలో రేగళ్ల సతీష్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవసారి ఉత్సవ సమితి కన్వీనర్‌గా నియమించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సీనియర్ సభ్యులు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కమల్‌పంత్, మల్లారెడ్డి, కొప్పు లకుమార్, జైని రాజేశ్వర్‌గుప్తా అమిత్, పవన్, నాగరాజు గుప్తా, శ్రీకాంత్‌గౌడ్, సోమనాథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని నియమిస్తున్న నియోజకవర్గ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కోకన్వీనర్ ప్రభాకర్

ప్రభుత్వ స్థలం కబ్జాను అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

నేరేడ్‌మెట్, ఆగస్టు 29: ప్రజలకు నీటిని అందించడానికి జలమండలికి కేటాయించిన స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు ఆక్రమించడానికి ప్రయత్నించారు. ఈ సంఘటన గౌతం నగర్ డివిజన్ సర్వే నంబర్ 844 బై 1 సర్వే మహేంద్రాహిల్స్‌లో చోటు చేసుకుంది. మల్కాజిగిరి ప్రజల సౌకర్యార్థం కోసం 3500 గజాల స్థలంలో జలమండలికి సంబంధించిన నీటి ట్యాంక్ నిర్మాణం కోసం కేటాయించినట్లు స్థానికులు తెలిపారు. ఈస్థలానికి సంబంధించి తప్పుడు పత్రాలను సృష్టించి కొంతమంది భూకబ్జాదారులు స్థలం వద్దకు వచ్చి కబ్జా చేస్తుండగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకొని వెనక్కి పంపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాద్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మండల తహసీల్దార్ అధికారులు వారిని అడ్డుకోవాలని వారు సూచించారు. తాగునీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రజలకు ఉపయోగపడేవిధంగా చూడాలని అధికారులను కోరారు. భూ కబ్జాదారులకు ఎవరైనా వత్తాసు పలికితే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్,ఆగస్టు29: రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఘట్‌కేసర్ శ్రీచైత్య డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తదానంచేశారు.అనంతరం విద్యార్థులకు పండ్లు,బ్రెడ్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం అధ్యక్షుడికి సన్మానం

రామంతాపూర్,ఆగస్టు 29: రామంతాపూర్ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నాగారం శ్రీనివాసాచారిని మాజీ కౌన్సిలర్ గువ్వల జలంధర్ గురువారం ఘనంగా శాలువాతో సన్మానించారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విశ్వకర్మలకు అండగా ఉంటారని జలంధర్ తెలిపారు.

నలుగురు యువకులు రిమాండ్

పీర్జాదిగూడ,ఆగస్టు29: మద్యం మత్తులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి వారిపై దురుసుగా ప్రవర్తించిన నలుగురు యువకులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం....బోడుప్పల్ హేమానగర్ కాలనీలో నివాసం ఉంటున్న బిట్టుకుమార్ యాదవ్, రాజ్‌కుమార్, విక్రమ్‌యాదవ్, నందన్ కుమార్‌లు కలిసి స్థానికంగా రోడ్డు నంబర్ 10లో బుధవారం రాత్రి మద్యం తాగుతున్నారు.పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు మద్యం తాగుతున్న యువకులు కనిపించడంతో అక్కడినుంచి వెళ్లాలని పోలీసులు వారికి చెప్పారు. దీంతో వారు పోలీసులపై దురుసుగా ప్రవర్తించమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారు. నలుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ శాంతి, కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి

జవహర్‌నగర్, ఆగస్టు 29: ప్రగతి పనులతో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 9వ డివిజన్ సంతోష్‌నగర్‌కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 25లక్షలతో కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ శాంతి సమక్షంలో 600మీటర్ల భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ నవీన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు బుజ్జి, దయాకర్‌చారి, బహదూర్ అలీ, బిక్షపతిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మొక్కలు నాటుతున్న కౌన్సిలర్లు

మేడ్చల్ రూరల్, ఆగస్టు 29: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కౌన్సిలర్లు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షిచాలని కౌన్సిలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు సరస్వతి మోహన్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మహేష్, జయ ప్రకాష్, నాగేశ్వర్ రావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుడి కల్యాణం

కీసర, ఆగస్టు 29:శ్రావణమాసోత్సవంలో భాగంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య గురువారం ఘనంగా జరిగింది. స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఆలయ ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసరగుట్టలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నాగారంలో మాట్లాడుతున్న నాగారం మున్సిపాలిటీ బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్

మేడ్చల్ కలెక్టరేట్,ఆగస్టు 29: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, నాగారం మున్సిపాలిటీ ఇన్‌చార్జి బుద్ధి శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. నాగారం మున్సిపాలిటీలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదుపై పార్టీ అధ్యక్షులు వేణు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో బీజేపీ సభ్యత్వ నమోదును అధిక సంఖ్యలో చేయాలని, మున్సిపాలిటీలో 43 బూత్‌ల్లో ఒక్కో బూత్‌కు 200 చొప్పున మున్సిపాలిటీలో 10 వేల సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులను,కార్యకర్తలను బీజేపీలో చేర్పించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి, కార్యదర్శి శ్యాంసుందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిలర్ లక్ష్మి, నాయకులు సురేష్,కిశోర్ గౌడ్,బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్,ఆగస్టు29: కళాశాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అనుకున్న లక్ష్యం వైపు పయనించాలని జేఎన్‌టీయూ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ ఎం.ఆశారాణి విద్యార్థులకు సూచించారు.ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంచుకున్న కోర్సుల్లో విలువల తో కూడిన నైపుణ్యాన్ని సాధించి ప్రతిభను కనబర్చాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఏవీరమణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.రమాకాంత్ రెడ్డి,హెచ్ఓడీ ఎం.రాజేశ్వర్‌రెడ్డి, సలహాదారుడు డాక్టర్ భాగ్యరాజ్,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలంసింగ్, అధ్యాపకులు,విద్యార్థులు,తల్లిదండ్రులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

కీసర: ఆర్‌బీఐని స్థాపించి 90 సంవత్సరాలు పూర్తి కావడంతో జూబ్లీహిల్స్ స్కూల్‌లో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమ వంతు బాధ్యతగా 90 మొక్కలను నాటారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ఆర్‌బీఐ ప్రాజెక్ట్ వేడుకలు జరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాళ్లు జూబ్లీహిల్స్ పాఠశాలలో ఘనంగా ఆర్గానిక్ గార్డెన్‌లో మొక్కలు నాటే పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు.

కార్యక్రమంలోఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కమల్ పి. పట్నాయక్ , జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ బి. పద్మజ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 29: గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి శైలజ జన్మదినం సందర్భంగా గురువారం నాగారం పట్టణంలో ఉన్న గ్రంథాలయానికి రూ. 10 వేల విలువ చేసి పుస్తకాలను ఆమె అందజేశారు.



పుస్తకాలను చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డికి అందజేస్తున్న బీజేపీ మహిళా నాయకురాలు శైలజ

వైభవంగా శ్రీలక్ష్మీ సుదర్శన మహాయజ్ఞం

మల్కాజిగిరి: శ్రీబాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రీలక్ష్మీ సుదర్శన మహాయజ్ఞ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహక అధికారి వీరేశం, ఫౌండర్ చైర్మన్ రాజసం జయ్ గోపాల్ సైంచర్ పాల్గొన్నారు.

మహాయజ్ఞం పూజలో పాల్గొన్న భక్తులు

తెలుగు భాష గొప్పదనాన్ని తెలుసుకోవాలి

మల్లాపూర్ శ్రీనికేతన్ హైస్కూల్ తెలుగుభాష గొప్పదనాన్ని నాటిక ప్రదర్శనల ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

కాప్రా, ఆగస్టు 29: తెలుగు భాష గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని శ్రీనికేతన్ హైస్కూల్ విద్యార్థులు చాటి చెప్పారు. గురువారం స్కూల్ ఆవరణలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిక్కానర్సింహ, ఉపాధ్యాయు లు రేణుక, లావణ్య వర్మ, మంజుల, వై.రేణు క, ప్రసూన, రజిత, శ్రావ్య, రమ్మ, అన్నపూర్ణ, సుధాకర్ రెడ్డి, నాయక్ బషీర్ , స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

- ఉప్పల్: నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో గిడుగు వెంకటరామమూర్తి జయంతి పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి వేషధారణతో పాటు, తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. కవిత్రాయన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. పాటలతో, నృత్యాలతో, నాటికలు, ఉపన్యాసాలతో తెలుగుభాష ఔన్నత్యా న్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ శివ్‌కుమార్, కరస్పాండెంట్ కల్పన, ప్రిన్సిపాల్ డి.సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో తెలుగు భాష గొప్పదనం గురించి మాట్లాడుతున విద్యార్థిని

- శామీర్‌పేట: మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, తెలుగు పద్యాలు, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, మణికాంత్, ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు ఉపేందర్, భవానీ పాల్గొన్నారు.

తెలుగుభాష పోటీలు... ఉప్పల్ విద్యార్థికి బహుమతి

బహుమతి అందుకుంటున్న విద్యార్థి హేమంత్ కార్తికేయ

ఉప్పల్ : తెలుగుభాష దినోత్సవం సందర్భంగా బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఇంటర్ స్కూల్ పోటీల్లో ఉప్పల్ జోషి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థి పీవీఎల్ఎన్. హేమంత్ కార్తికేయ ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈ మేరకు రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె.రజనీప్రియ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.